
సాక్షి ఒడిశా

శుక్రవారం । 12 । జనవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.3,61,999
బంగారం	400 మిల్లీ గ్రాములు
వెండి	25 గ్రాముల 200 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



ప్రాకార ప్రాజెక్టు అంకురార్పణ నేడు

పవిత్ర పుణ్యక్షేత్రం పూరీలో వారసత్వ ప్రాకార పథకం అంకురార్పణ కార్యక్రమం శుక్రవారం చేపట్టనున్నారు.

-8లో



323 కిలోల గంజాయి స్వాధీనం

గంజాం, కొందమాల్ జిల్లాల పోలీసులు వేర్వేరు వాహనాలపై దాడులు నిర్వహించి 323 కిలోల గంజాయిని సీజ్ చేశారు.

-8లో

న్యూస్‌రీల్

కాంగ్రెస్‌కు రవిశంకర్ గొమాంగో రాజీనామా



రవిశంకర్ గొమాంగో

రాయగడ: జిల్లాలోని రామనగుడ సమితి చైర్మన్‌గా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నాయకుడు రవి శంకర్ గొమాంగో ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామాను జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బిజయ కుమార్ గొమాంగోకు బుధవారం అందజేశారు. పార్టీకి చెందిన జిల్లా నాయకులు సిద్ధాంతాలకు అనుగుణంగా వ్యవహరించడం లేదని, అందువలన పార్టీ నుంచి వైదొలుగుతున్నట్లు పేర్కొన్నారు. గత పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి రామనగుడ సమితి సభ్యునిగా గెలిపొందిన ఆయన, అందరి సహకారంతో సమితి చైర్మన్ పదవిని కైవసం చేసుకున్నారు. త్వరలో తన భవితవ్యం గురించి తెలియజేయనున్నట్లు వెల్లడించారు.

తరతరణి సన్నిధిలో గవర్నర్



పూజలు నిర్వహిస్తున్న గవర్నర్ రఘుబర్ దాస్

బరంపురం: దక్షిణ ఒడిశా ప్రజల ఆరాధ్య దేవత, రూశికుల్య నదీతీరం పక్కన కొండపై వెలసిన తరతరణి అమ్మవారిని రాష్ట్ర గవర్నర్ రఘుబర్ దాస్ గురువారం దర్శించుకున్నారు. కొండపైకి వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులతో ఆలయ అభివృద్ధిపై మాట్లాడారు. ఆయనతో పాటు కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా, ఎస్పీ జగ్‌మోహన్ మీన తదితరులు ఉన్నారు.

సింహం పిల్లల బర్త్ డే వేడుకలు



కేక్ కట్ చేస్తున్న జూ సిబ్బంది

భువనేశ్వర్: నగర శివారులోని బారంగ్ నందన కానన్ జంతు ప్రదర్శన శాలలో చూడముచ్చట వేడుక గురువారం చోటుచేసుకుంది. ఇక్కడ జన్మించిన 2 సింహం పిల్లల తొలి జన్మదిన వేడుకలు వైభవంగా నిర్వహించారు. వీటి పేర్లు మాయా, శివంలు కావడం విశేషం.

టెక్నాలజీతో నేరాల గుర్తింపు

భువనేశ్వర్: నేరాలు, నేర కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా ఎదుర్కోవడానికి కృత్రిమ పరిజ్ఞానం (ఏఐ)తో ముందుకు వెళ్లేందుకు పోలీసు యంత్రాంగం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో కటక్ - భువనేశ్వర్ జంట నగరాల కమిషనరేట్ పోలీసులు గూగుల్ అప్లికేషన్‌లో క్రైమ్ మ్యాపింగ్ అనే కొత్త సాంకేతికతను అవలంబించబోతున్నారు. తొలి దశలో స్నాచింగ్‌లు, దోపిడీ ఘటనలపై పోలీసులు దృష్టి సారిస్తారు. దీని కోసం వివిధ టెలికాం సర్వీస్ ప్రొవైడర్ల సహాయాన్ని తీసుకుంటారు. వీరి నుంచి నేరస్తుల లొకేషన్లు, వారి కదలికలు, కాల్ రికార్డులను సేకరించేందుకు వీలవుతుందని జంట నగరాల పోలీసు కమిషనర్ సౌమేంద్ర ప్రియదర్శి తెలిపారు. సిల్వర్ సిటీ కటక్, స్మార్ట్ సిటీ భువనేశ్వర్‌లోని పలు ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఏకీకృత కమాండ్ కంట్రోల్ రూమ్ ఈ కెమెరాల ఫీడ్‌ను స్వీకరిస్తుంది. ఆర్టిఫీసియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఈ వ్యవస్థలోని సమాచారం విశ్లేషిస్తారు. తదుపరి దశలో నేర కార్యకలాపాలను ఎదుర్కోవడంలో వాటిని ప్రయోగించి వ్యూహాత్మకంగా నేరస్తులను అదుపులోకి తీసుకుంటారు. భవిష్యత్తులో నేర నియంత్రణ కార్యక్రమంలో కమిషనరేట్ పోలీసులను మరింత ప్రభావవంతంగా మరియు సమర్థవంతంగా ముందుకు సాగేందుకు ఈ కార్యాచరణ దోహదపడుతుందని కమిషనర్ తెలిపారు.

భాషపై గౌరవం అవసరం

- సీఎం నవీన్ పట్నాయక్
- ప్రథమ ప్రపంచ ఒడియా భాష సదస్సు లోగో ఆవిష్కరణ



లోగో ఆవిష్కరిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: ప్రతి ఒక్కరికీ భాషపై గౌరవం అవసరమని సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 5 వరకు జరగనున్న ప్రథమ ప్రపంచ ఒడియా భాష సదస్సు లోగోను ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ గురువారం ఆవిష్కరించారు. 'భాషయే భవిష్యత్' నినాదంతో లోగో రూపుదిద్దుకోవడం విశేషం. ఒడియా భాష గతం, వర్తమానం, భవిష్యత్తు గురించి చర్చించేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సీఎం నవీన్ పట్నాయక్ మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. మేధావులు, పరిశోధకులు, భాషావేత్తలు, విద్యార్థుల మధ్య అభిప్రాయాల మార్పిడికి ఈ సదస్సు మంచి వేదికగా నిలుస్తుందని ఆశిస్తున్నానన్నారు. ఆధునిక భారతదేశంలో ఒడిశా మొదటి భాషా ప్రయుక్త రాష్ట్రమని పేర్కొన్నారు. ఒడియా భాష శాస్త్రీయ భాషల్లో ఒకటిగా హోదా పొందిందని వెల్లడించారు. ఈ హోదా ఒడిశా గెడ్డ, భాష వైభవాన్ని పెంపొందించిందన్నారు. తొలి ప్రపంచ ఒడియా సదస్సులో ఒడియా భాష గతం, వర్తమానం మరియు భవిష్యత్తు గురించి చర్చించి, దాని ప్రచారానికి లక్ష్యాలు నిర్దేశించనున్నట్లు వెల్లడించారు. విశిష్ట వారసత్వానికి బలమైన వారధిగా భావి తరాలలో ఒడియా భాషపై గౌరవం పెంపొందించే విధి విధానాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఒడియా భాష ఎలా పురోగమనం భవిష్యత్ కార్యాచరణను ఈ సదస్సు మార్గదర్శకాల్ని కనుగొనాలని పిలుపునిచ్చారు.

సమన్వయం చేసుకోవాలి

గతేడాది డిసెంబర్ 19న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక అధ్యక్షతన జరిగిన వారసత్వ మంత్రి మండలి సమావేశంలో ఒడియా భాష ప్రపంచ సదస్సుకు ఆమోదం లభించిన విషయం తెలిసిందే. కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు సంబంధిత వర్గాలు సమన్వయం చేసుకోవాలని ఒడియా భాష, సాహిత్యం మరియు సాంస్కృతిక శాఖను ఆయన ఆదేశించారు. ప్రపంచ ఒడియా భాషా సదస్సు మన భాష యొక్క ప్రత్యేక గుర్తింపును ప్రతిబింబిస్తుందన్నారు. ఒడియాను శాస్త్రీయ భాషగా ఎలా మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావాలనేది చర్చించడం జరుగుతుందన్నారు. ప్రస్తుత కాలంలో వివిధ సాంకేతిక అనువర్తనాల్లో భాషను స్వీకరించేలా రాష్ట్రంలోని యువతరాన్ని ఆకర్షించేందుకు ఈ సదస్సు మార్గదర్శకాల్ని అన్వేషిస్తుందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ భాషావేత్తలు మరియు భాషా పరిశోధకులు మూడు రోజుల సదస్సులో ఒడియా భాష యొక్క ప్రాచీనత మరియు కొనసాగింపుపై చర్చించనున్నారు. భాష మూలం, అభివృద్ధి, వ్యాప్తి గురించి చర్చించడమే కాకుండా, నిపుణులు దాని చరిత్ర, వర్తమానం మరియు భవిష్యత్తు రూపురేఖలపై వాస్తవ ఆధారిత ప్రదర్శనను చేస్తారు.

రాములోరికి 'బాంధకళ చీర'



ఈశ్వర్ మెహర్ నేసిన చీర

భువనేశ్వర్: ఈనెల 22న అయోధ్యలో రామ మందిర ప్రతిష్ఠ మహోత్సవానికి భారీ సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా పశ్చిమ ఒడిశా బర్‌గడ్ జిల్లాకు చెందిన ఒక నేత కుటుంబం ఈ మహోత్సవానికి ప్రసిద్ధ పశ్చిమ ఒడిశా సంబల్‌పురి బాంధకళ చీరను నేసింది. బర్‌గడ్ పట్టణానికి సమీపంలోని కోటపల్లి గ్రామానికి చెందిన బాంధకళ మాస్టర్, జాతీయ చేనేత అవార్డు గ్రహీత ఈశ్వర్ మెహర్ ఢిల్లీలో రామసేతు నేపథ్యంపై తాను నేసిన చీరను ప్రదర్శించనున్నాడు. ఈ చీరని 'రామ సేతు' చీరగా పేర్కొన్నాడు. దీని నేతలో సహజ నీలం, నలుపు రంగుల్లో టస్సర్ సిల్క్, ఖాదీ కాటన్ పోగులను వినియోగించారు. 59 ఏళ్ల ఈశ్వర్ మెహర్ ఈ చీర నేత శైలి వివరిస్తూ నీలిరంగు చీరపై చేపలు, తాబేళ్ల మూలాంశాలతో సముద్రాన్ని చూపుతుందని చెప్పారు. చీర మధ్యలో రాళ్లతో చేసిన వంతెనపై రామ్ అని రాసిన నల్లటి నమూనా ఉంది. అదేవిధంగా హనుమంతుడు, వానర సేన సుగ్రీవుడు, అంగద, నల, నీల, ఆంచల్‌లో రామసేతును నిర్మించడంలో పనిచేస్తున్న ఉడుతల చిత్రాలను కూడా అల్లాడు.

2022లో శ్రీకారం..

2022 సంవత్సరంలో తాను, తన భార్య రేబతి, కుమారుడు మానస్ మెహెర్‌లు ఈ చీరను నేసినట్లు ఈశ్వర్ మెహర్ పేర్కొన్నాడు. ఇది అయోధ్య రామ మందిరం ప్రతిష్ఠ మహోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని నేసినది కాదని స్పష్టం చేశారు. గతంలో అనేక పౌరాణిక ఇతివృత్తాలపై పని చేసిన ఈశ్వర్ ఆ సంవత్సరం రామసేతు నిర్మాణం ఇతివృత్తంతో చీర నేయాలని సంకల్పించారు. బాంధ కళలో నిపుణులైన ముగ్గురితో కూడిన కుటుంబానికి చీర నేయడానికి 5 నెలలు పట్టిందన్నారు. చీరలో నేతలో సహజమైన రంగుల్ని వినియోగించినట్లు పేర్కొన్నారు. ఇనుప తుప్పు, కంది పొడి, సెనగ పిండి, బెల్లం, నీలిమందు నుంచి ఉత్పత్తి చేయబడిన సహజ రంగులు ఉపయోగించినట్లు వివరించారు. ఈ అత్యద్భుతమైన చీర ధర రూ.1.10 లక్షలని ఆయన తెలిపారు. ఒకే ఒక్క చీర నేసినట్లు వెల్లడించారు. రామాలయ ప్రతిష్ఠాపన కార్యక్రమం దగ్గర పడడంతో ఈశ్వర్ మరియు అతని సోదరుడు దుష్యంత్ మెహెర్‌లు న్యూఢిల్లీలో చీరను ప్రదర్శించడానికి ప్రయత్నిస్తున్నారు. ఏదో ఒక ఎగ్జిబిషన్‌లో లేదా న్యూఢిల్లీలోని జగన్నాథ ఆలయంలో ప్రదర్శించడానికి ప్రయత్నిస్తున్నారు.

విద్యార్థులతో రాజకీయాలు విచారకరం



మాట్లాడుతున్న దుర్గాపండ తదితరులు

- పీసీసీ సాధారణ కార్యదర్శి పండ

రాయగడ: అధికార బీజేడీ విద్యార్థులను అడ్డం పెట్టుకొని ఆ పార్టీ ఉనికిని చాటుకునేందుకు చేస్తున్న ప్రయత్నం విచారకరమని పీసీసీ ప్రధాన కార్యదర్శి దుర్గా పండ ఆరోపించారు. పట్టణంలో బారిజోల గ్రామ సమీపంలోని జీఐఏసీఆర్ మైదానంలో జిల్లా యంత్రాంగం బుధవారం నిర్వహించిన నువా-ఓ ఫెస్ట్ కార్యక్రమంలో జరిగిన తొక్కిసలాటలో ఇద్దరు విద్యార్థినులు అస్వస్థతకు గురవ్వడం బాధాకరమన్నారు. ఈ మేరకు గురువారం కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నువా-ఓ ఫెస్ట్ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ కళాశాలు, ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులను రప్పించిన జిల్లా యంత్రాంగం, దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేయకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. సుమారు 15 వేల మందికి పైగా విద్యార్థులకు సకాలంలో భోజనాలు లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. సరైన ఏర్పాట్లు చేయలేని నిర్వాహకులు ఇంతమందిని ఎందుకు కార్యక్రమానికి పిలిచారని ప్రశ్నించారు. నిర్వహణ లోపంతోనే ప్రమాదం జరిగిందని, అందువలన కలెక్టర్ వేతనం నుంచి ఆర్థిక సాయం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా యువజన కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు అస్లామ్ ఖాన్, సీనియర్ నాయకుడు అప్పల స్వామి కద్రక, డీసీసీ ఉపాధ్యక్షుడు శంకర్షన్ మంగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త జిల్లాల ఏర్పాటుపై ఆంక్షలు

- ఆదేశాలు జారీ చేసిన హైకోర్టు

భువనేశ్వర్: హైకోర్టు అనుమతి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటుపై తుది ఉత్తర్వులు జారీ చేయకుండా ఒడిశా హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను మరో మూడు వారాల పాటు పొడిగించింది. గతేడాది డిసెంబర్ 21న జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులకు అనుగుణంగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసేందుకు అదనపు ప్రభుత్వ న్యాయవాది డి.కె.మహంతి సమయం కోరడంతో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.షడంగి, జస్టిస్ ఎం.ఎస్. రామన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం జిల్లా పునర్వ్యవస్థీకరణ ఆంక్షలను పొడిగించింది. ఈ మేరకు 3 వారాల గడువు కేటాయించింది. గతంలో జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులు తదుపరి తేదీ వరకు కొనసాగుతాయని హైకోర్టు ఆదేశాలు స్పష్టం చేశాయి. ఎలాంటి మార్గదర్శకాలు, నియమాలు లేకుండా కొత్త జిల్లాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని గతంలో ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)ను విచారించిన న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. కొత్త జిల్లాల ఏర్పాటు అధికారానికి సంబంధించి, జస్టిస్ రాజ్ కిషోర్ దాస్ కమిటీ (జిల్లా పునర్వ్యవస్థీకరణ కమిటీ), 1975 నివేదిక మరియు 1991 కేబినెట్ సబ్ కమిటీ నివేదిక మినహా, జిల్లా పునర్వ్యవస్థీకరణ సంబంధిత ఇతర సమాచారం ఏదీ అందుబాటులో లేకపోవడాన్ని హైకోర్టు నిలదీసింది. అయితే పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను ప్రభుత్వం కొనసాగించాలనుకుంటే హైకోర్టు అనుమతించింది.

ప్రభుత్వానికి ఎదురు దెబ్బ

ఈ ఉత్తర్వు బర్‌గడ్ నుంచి పదంపూర్‌ను కొత్త జిల్లాగా విభజించాలనే ప్రభుత్వ చర్యకు ఎదురుదెబ్బగా నిలిచింది. 2023 సంవత్సరం ఫిబ్రవరి నెలలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పదంపూర్‌కు ఏడాదిలోపు జిల్లా హోదా వస్తుందని ప్రకటించారు. గతేడాది డిసెంబర్‌లో జరగిన ఉప ఎన్నికల్లో పదంపూర్ జిల్లాను ఏర్పాటు చేస్తామని బీజేడీ హామీ ఇచ్చింది. గత నెలలో ప్రభుత్వం ఉత్తర డివిజన్ రెవెన్యూ డివిజనల్ కమిషనర్ నేతృత్వంలో అధికారిక బృందంతో జిల్లా ప్రధాన కార్యాలయాల నిర్మాణం కోసం కొన్ని స్థలాలను పరిశీలించింది. అయితే పదంపూర్‌ను ప్రత్యేక జిల్లాగా ప్రకటించకుండా ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా, గత ఏడాది డిసెంబర్ 29న ముఖ్యమంత్రి పట్నాయక్ నవీన్ బర్‌గడ్ జిల్లాలో పదంపూర్‌కు అదనపు జిల్లా మేజిస్ట్రేటు (ఏడీఎం) కొత్త పోస్టును సృష్టించే ప్రతిపాదనను ఆమోదించారు. ఈ నేపథ్యంలో 2020 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి చవాన్ కునాల్ మోతీరామ్‌ను ఏడీఎంగా నియమించినట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పదంపూర్‌తో కంటాబంజి, టిట్లాగడ్, అతొగాడా, ధర్మగడ్ మరియు మరికొన్ని ప్రాంతాల ప్రజలు కూడా ప్రత్యేక జిల్లాలను డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 25 కొత్త జిల్లాల కోసం డిమాండ్లు వచ్చాయని ప్రభుత్వం ఇటీవల అసెంబ్లీకి తెలిపింది.

కెందుగుడలో పక్షుల లెక్కింపు



పక్షులను లెక్కిస్తున్న అధికారులు

రాయగడ: జిల్లాలోని కెందుగుడ డ్యామ్‌లో పక్షుల లెక్కింపు కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టారు. ప్రతీ ఏడాది డిసెంబర్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన పక్షులు ఇక్కడికి అతిథులుగా వస్తుంటాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని అటవీ శాఖ అధికారులు పక్షుల లెక్కింపు కార్యక్రమాన్ని చేపడతారు. ఉన్న పక్షుల సంఖ్యతో పాటు కొత్తగా విడిది కోసం వచ్చిన పక్షులను లెక్కింపు సంబంధిత నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తారు. ఈ క్రమంలో బుధవారం, గురువారం కెందుగుడ డ్యామ్‌లో లెక్కింపు ప్రక్రియ కొనసాగింది. అటవీ శాఖ ఏసీఎఫ్ సందీప్ పృష్టి, గుడారి అటవీ శాఖ రేంజర్ దిలీప్ పట్నాయక్ ఆధ్వర్యంలో కొనసాగిన ఈ లెక్కింపు కార్యక్రమంలో మూడు పడవల్లో సిబ్బంది రోజుకు ఐదు గంటలు శ్రమించి లెక్కింపు చేపట్టారు. రెండు రోజులు జరిపిన లెక్కింపులో భాగంగా 18 రకాల 1,500 లకు పైగా పక్షులు ఉన్నట్లు గుర్తించారు. మూడు పడవల్లో 18 మంది సిబ్బంది ఈ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఏసీఎఫ్ పట్నాయక్ తెలియజేశారు.

సత్తిగూడ జలాశయంలో...

మల్కన్‌గిరి: జిల్లాలోని సత్తిగూడ జలాశయంలో జిల్లా అటవీ శాఖ అధికారులు పక్షుల లెక్కింపు ప్రక్రియ చేపట్టారు. దీనిలో భాగంగా మల్కన్‌గిరి జిల్లా అటవీ శాఖ అధికారి ప్రతాప్ కొత్తపల్లి మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది సైతం సత్తిగూడ, బలిమెల, చిత్రకొండ, మత్తిలి శివసాగర్ జలాశయాల్లో 10 బృందాలు లెక్కింపు ప్రక్రియ చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది చిత్రకొండ జలాశయానికి విదేశీ పక్షులు ఎక్కువగా వస్తున్నాయని, అందువలన తగిన ఆహారం అందజేయాలని సూచించారు. నాలుగు జలాశయాల్లో మొత్తం 55 జాతులకు చెందిన 11,554 పక్షులను గుర్తించినట్లు వెల్లడించారు.



మల్కన్‌గిరి: సత్తిగూడలో పక్షుల లెక్కింపునకు వెళ్తున్న అటవీ శాఖ బృందం



మల్కన్‌గిరి: జలాశయం ఉన్న పక్షులు

తులసీపహాడ్‌లో జన సంపర్క్ శిబిరం



మహిళలకు దుస్తులు అందజేస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి తులసీపహాడ్‌లో రెండో బెటాలియాన్ జవాన్లు జన సంపర్క్ శిబిరాన్ని గురువారం నిర్వహించారు. కిర్మిట్ల, తులసీ, చెర్కోట్ల, మురిబెడ, టిమురుపల్లి మొదలగు గ్రామలకు చెందిన ప్రజలు శిబిరానికి హాజరయ్యారు. దీనిలో భాగంగా గిరిజనులకు నిత్యవసర సరుకులు, దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్‌ఎఫ్ అధికారి సైలేంద్ర సిన్హా మాట్లాడుతూ గిరిజనులకు అనునిత్యం అండగా ఉంటామని తెలియజేశారు. ఇక నుంచి మావోల చేతుల్లో కీలు బొమ్మలా బతకాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఇక్కడ ప్రజలకు ఎటువంటి కష్టం వచ్చినా తెలియజేయాలని సూచించారు.



గిరిజన కళాకారులతో జవాన్లు



శిబిరానికి హాజరైనవారికి భోజనాలు పెడుతున్న దృశ్యం

క్లుప్తంగా

ఏటీఎంలో వృద్ధురాలి మృతదేహం


వృద్ధురాలి మృతదేహం

జయపురం: పట్టణంలోని మెయిన్ రోడ్డులో బంకమఠం ఎదురుగా ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఏటీఎంలో గురువారం ఉదయం ఒక వృద్ధురాలి మృతదేహం పడి ఉండడం సంచలనం సృష్టించింది. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని అక్కడ నుంచి తరలించారు. వృద్ధురాలు ఎకంబా గ్రామానికి చెందినదిగా గుర్తించారు. కొద్ది రోజులుగా మతి స్థిమితం లేకుండా తిరుగుతునట్లు పేర్కొన్నారు.

ప్రైవేట్ పాఠశాలకు తాళాలు

టెక్కలి: సంక్రాంతి సెలవుల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘిస్తూ టెక్కలిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో గురువారం తరగతులు నిర్వహిస్తుండడంతో, తమకు అందిన సమాచారం మేరకు విద్యా శాఖాధికారులు ఆ పాఠశాల వద్దకు చేరుకుని బడికి తాళాలు వేశారు. పాఠశాల తలుపులు మూసి లోపల తరగతులు నిర్వహిస్తున్న విషయాన్ని ఏబీవీపీ విద్యార్థి సంఘం ప్రతినిధులు మురళి, మదన్, అరవింద్, శ్యామ్ తదితరులు తెలుసుకుని తక్షణమే మండల విద్యా శాఖాధికారులు తులసీరెడ్డి, చిన్నారావు తదితరులకు సమాచారం అందజేశారు. దీంతో అధికారులు పాఠశాల వద్దకు చేరుకుని కరస్పాండెంట్ శ్రీనివాసరావుపై మండిపడ్డారు. అనంతరం పాఠశాలకు తాళాలు వేశారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో డ్రైవర్‌కు గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని బాటలింగ్ యూనిట్ మద్యం గోదాం వద్ద విద్యుత్ షార్ట్ షర్క్యూట్‌తో షాక్ తగిలి లారీ డ్రైవర్, యజుమాని రవి గాయపడ్డారు. మద్యం అన్‌లోడ్ చేసే క్రమంలో పైనున్న విద్యుత్ లైన్లకు తాకటంతో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ అయ్యింది. దీంతో షాక్ కొట్టి ఆయన కింద పడిపోయారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడి నుంచి వైజాగ్ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

జిల్లా కవులకు ఏలూరులో సత్కారం

శ్రీకాకుళం కల్చరల్: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఏలూరులో జరిగిన సాహిత్య సంక్రాంతి సంబరాల సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు కవులను సత్కరించారు. జిల్లా ప్రభుత్వ యంత్రాంగం సౌజన్యంతో శ్రీశ్రీ కళావేదిక అధినేత కత్తిమండ ప్రతాప్ సమక్షంలో శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చిన మహ్మద్ రఫీ, జంధ్యాల శరత్‌బాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమారరాజు, బి.కోటేశ్వరరావు, పీవీ దుర్గాప్రసాద్, చాడ శ్రీనివాస్‌లను ఘనంగా సత్కరించారు.

'ఆరోగ్యం శ్రద్ధగా కాపాడుకోవాలి'

శ్రీకాకుళం క్రైమ్: విధి నిర్వహణలో అలుపన్నది లేకుండా శారీరక శ్రమనోర్చి బాధ్యతలు నిర్వర్తించారని, పదవీ విరమణ తర్వాతైనా ఆరోగ్యం శ్రద్ధగా కాపాడుకోవాలని ఎస్పీ జి.ఆర్.రాధిక హోంగార్డు కొవ్వూరు అప్పారావుకు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు అప్పారావు దంపతులకు గురువారం ఆమె సత్కారం చేశారు. తక్షణ ఆర్థిక సాయం కింద రూ. 5 వేలు నగదును అందజేసి విధి నిర్వహణలో అప్పారావు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ జె.తిప్పేస్వామి, డీఎస్పీలు వై.శృతి, నాగేశ్వరరెడ్డి, ఆర్ఐ కె.నర్సింగమూర్తి, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రీరితిక

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కూన సరస్వతి (రితిక)ను నియమిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య నియామకం పత్రం అందించారు. ఈ మేరకు అమరావతిలో నియామక పత్రం గురువారం అందించారు. రాష్ట్రంలో ఉన్న బీసీ మహిళల్లో చైతన్యం తీసుకొని వచ్చి రాజ్యాధికారం దిశగా అడుగులు వేసేలా కార్యాచరణ చేయాలని కృష్ణయ్య సూచించారు. అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తానని సరస్వతి అన్నారు.

మద్యం మత్తులో యువకుల హల్‌చల్

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని సూర్యమహల్ కూడలిలో గురువారం రాత్రి మద్యం మత్తులో నలుగురు యువకులు హల్‌చల్ చేశారు. కారులో షికారు చేస్తూ వచ్చే పోయే ప్రజలకు అసౌకర్యం కలిగిస్తుండటంతో ట్రాఫిక్ ఎస్ఐ ఎస్ఎస్ దొరకు అనుమానం వచ్చి తమ సిబ్బందితో కలిసి కారును సూర్యమహల్ కూడలి వద్ద ఆపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేద్దామని ప్రయత్నించగా యువకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఆ ప్రాంతంలో కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఎంతకీ యువకులు టెస్టుకు సహకరించకపోవడంతో కారును ట్రాఫిక్ పీఎస్‌కు తరలించినట్లు ఎస్ఐ ఎస్ఎస్ దొర పేర్కొన్నారు.

ప్రాకార ప్రాజెక్టు అంకురార్పణ నేడు


సమావేశంలో పాల్గొన్న పూరీ గజపతి మహారాజా దివ్య సింఘ్ దేవ్ తదితరులు

భువనేశ్వర్: పవిత్ర పుణ్యక్షేత్రం పూరీలో ఈనెల 17న వారసత్వ ప్రాకార పథకం లోకార్పణ మహోత్సవం నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం అంకురార్పణ కార్యక్రమం చేపడతారు. ఆలయ ఆచారాల ప్రకారం గువా టెక్కా, అంకురార్పణతో యజ్ఞం మొదటి దశ ప్రారంభమవుతుంది. పూరీ గజపతి మహా రాజా దివ్యసింఘ్ దేవ్ అధ్యక్షతన గురువారం జరిగిన పాలక మండలి సమావేశంలో ఈ మేరకు కార్యక్రమాలు ఖరారు చేశారు. ఒడిశా వంతెన, నిర్మాణ కార్పొరేషన్ (ఓబీసీసీ) పనులను పూర్తిచేసి శ్రీజగన్నాథ ఆలయ పాలక వర్గానికి (ఎస్‌జేటీఏ)కి పూర్తి ప్రాజెక్ట్ అప్పగించింది. ఈ ప్రాజెక్టు పరిధిలోని 27 మఠాలు, మూడు ఆలయాల వెలుపలి సుందరీకరణ పనులు పూర్తి కాగా, మరో మూడు మఠాల పనులు ఇంకా కొనసాగుతున్నట్లు సమాచారం.

3 రోజుల మహోత్సవం

శ్రీ మందిరం వారసత్వ ప్రాకార పథకం లోకార్పణ మహోత్సవం 3 రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలు ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు మూడు రోజుల పాటు కొనసాగుతాయి. ఈ సందర్భంగా పలు పూజలు, సంబంధిత ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలు భారీ స్థాయిలో నిర్వహించనున్నట్లు శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి (సీఏవో) రంజన్ కుమార్ దాస్ మీడియాకు తెలిపారు. చివరి రోజు 17న మధ్యాహ్నం 1.15 గంటల నుంచి 1.30 గంటల మధ్య ప్రారంభోత్సవ వేడుకలు ప్రారంభం అవుతాయి. శ్రీ మందిరం వారసత్వ ప్రాకార పథకం ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు లోకార్పణం చేస్తారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత భక్తులు ప్రాకార ప్రదక్షిణలు చేసి సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించేందుకు అనుమతిస్తారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. పూరీ పట్టణ వ్యాప్తంగా అన్ని కార్యకలాపాలు సీసీ కెమెరాల నిఘాలో ఉంటాయని తెలిపారు.

ప్రాకార ప్రాజెక్టు యానిమేషన్ చిత్రం


సైకత యానిమేషన్ చిత్రంలో దృశ్యం

భువనేశ్వర్: పూరీ జగన్నాథ ఆలయం శ్రీమందిర వారసత్వ ప్రాకార ప్రాజెక్టు ఆధారంగా సైకత శిల్పి మానస్ కుమార్ సాహు సైకత యానిమేషన్ చిత్రాన్ని రూపొందించాడు. 5 నిమిషాల 30 సెకన్ల నిడివి కలిగిన యానిమేషన్ చిత్రం ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులతో రద్దీగా ఉండే ప్రసిద్ధ దేవాలయం పరిసర పరివర్తనను వర్ణిస్తుంది. ఆలయానికి అనుసంధాన పరిచే బొడొ దండొ (సువిశాల బాట) ఇరువైపుల భక్తులు, యాత్రికులకు అసౌకర్యాన్ని కలిగించే ఇరుకైన రోడ్లు, ఆక్రమణల వల్ల రద్దీ, అపరిశుభ్రత మరియు చెత్త తొలగించి వివిధ సౌకర్యాలతో సువిశాల ప్రాకారంతో శ్రీ మందిరం వారసత్వాన్ని ప్రతిబింబించే శ్రీసేతు, ఎయిర్ కండిషన్ ఇతరేతర అధునాత సౌకర్యాలతో క్యూ కాంప్లెక్సు, మరుగు దొడ్లు, వాహనాల కోసం సువిశాల పార్కింగ్ వ్యవస్థ మరియు రోడ్డుపై ల్యాండ్ స్కేపింగ్ వంటివి సైకత చిత్రంలో యానిమేషన్ ద్వారా ప్రదర్శించడం విశేషం. ఈ సందర్భంగా శిల్పి మానస్ కుమార్ సాహు యాత్రికుల పట్టణాన్ని అంతర్జాతీయ గమ్యస్థానంగా మార్చే ప్రాజెక్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడానికి దారితీసిన కారణాలను కూడా విపులంగా వివరించాడు. ఈ సమగ్ర యానిమేషన్ చిత్రీకరణకు దాదాపు 15 గంటల పాటు నిర్విరామంగా శ్రమించినట్లు తెలిపాడు.

323 కిలోల గంజాయి స్వాధీనం


కొందమాల్‌లో సీజ్ చేసిన గంజాయి బస్తాలు

బరంపురం: గంజాం, కొందమాల్ జిల్లాల పోలీసు అధికారులు బుధవారం, గురువారం రెండు రోజుల పాటు వేర్వేరు వాహనాలపై దాడులు నిర్వహించి 323 కిలోల గంజాయిని సీజ్ చేశారు. కొందమాల్ ఎస్పీ సుబెంద్ కుమార్ పాత్రో తెలిపిన వివరాల మేరకు.. జిల్లాలోని బల్లిగుడా అటవీ ప్రాంతం నుంచి బరంపురం వైపు వస్తున్న ఒక టాటా వ్యాన్, మూడు ద్విచక్ర వాహనాల్లో గంజాయి రవాణ అవుతున్నట్లు ముందుస్తు సమాచారం వచ్చింది. దీంతో గచ్చపడా పోలీసు అధికారులు కళింగా, ఘాటి మధ్య మూడు రోడ్ల జంక్షన్‌లో కాపు కాశారు. గంజాం సరిహద్దులకు ఆ వాహనాలు వచ్చిన సమయంలో దాడులు చేపట్టి 20 బస్తాల్లో తరలిస్తున్న 250 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు కారు, మూడు బైక్‌లను సీజ్ చేశారు. అదేవిధంగా గంజాం జిల్లా దిగపండి పోలీసులు డెంగపదర జంక్షన్‌లో అనుమానం ఉన్న ఆటోపై దాడులు జరిపి 5 బస్తాల్లో 73 కిలోల గంజాయిని సీజ్ చేశారు. అలాగే ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు.


అరెస్టు చేసిన నిందితులను చూపిస్తున్న దిగపండి పోలీసులు

పెరిగిన ఉష్ణోగ్రతలు

- కమ్ముకుంటున్న పొగమంచు
- రహదారి భద్రతపై మార్గదర్శకాలు జారీ

భువనేశ్వర్: రాష్ట్రంలో పలుచోట్ల రాత్రిపూట కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో పెరుగుదల నమోదయ్యింది. కొరాపుట్ అత్యంత శీతల ప్రదేశంగా కొనసాగుతోంది. ఈ ప్రాంతంలో 9 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ రాత్రి ఉష్ణోగ్రత నమోదైంది. గత 24 గంటల్లో రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో ఉష్ణోగ్రత పెరుగుదల నమోదైనట్లు స్థానిక భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రాంతీయ కేంద్రం తెలిపింది. రాష్ట్రమంతటా చాలా చోట్ల కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరిగాయి. కొన్ని చోట్ల సాధారణం కంటే అధికంగా రాత్రి పూట కనిష్ఠ ఉష్ణోగ్రత పుంజుకుంది. అయితే రెండు రోజుల తర్వాత కనిష్ఠ ఉష్ణోగ్రతలు 2 డిగ్రీల సెల్సియస్ నుంచి 3 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశం ఉందని వాతావరణ కార్యాలయం అంచనా వేసింది. దీంతో ఒడిశాలోని కొన్ని ప్రాంతాల్లో ఈ సీజన్‌లో మరోసారి చలి గాలులు వీచే అవకాశం ఉంది.

ప్రాంతం	కనిష్ఠ ఉష్ణోగ్రత (డిగ్రీల సెల్సియస్)
సంబల్పూర్	18.4
భవానీపట్న	16.8
హిరాకుడ్	16.8
సుందర్‌ఘర్	15.5
ఫుల్బాని	14.0
చంద్బాలీ	19.4
బాలాసోర్	18.3
కటక్	18.5
భువనేశ్వర్	19.2

తగ్గిన దృశ్యమానత

రాష్ట్రంలో పలుచోట్ల రాత్రిపూట ఉష్ణోగ్రతలు పెరగగా, కొన్నిచోట్ల పొగమంచు దట్టంగా కమ్మడంతో దృశ్యమానత తగ్గింది. రౌర్కెలా, ఫుల్బాణి, గోపాలపూర్, పారాదీప్, భువనేశ్వర్, ఝార్సుగుడ, భవానీపట్న, సంబల్‌పూర్ మరియు కెంజొహర్ ప్రాంతాల్లో పొగమంచు తక్కువగా కనిపించింది. భద్రక్, జాజ్‌పూర్, కటక్, పూరీ, నయాగఢ్, జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా , ఢెంకనాల్, అంగుల్, కెంజొహర్, సుందర్‌గఢ్, ఝార్సుగుడ, ఖుర్దా, గంజాం, కంధమల్, కలాహండి, బొలంగిర్, భద్రక్‌లలో ఒకటి, రెండు చోట్ల దట్టమైన పొగమంచు ఉంటుందని ఐఎండీ ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకు రాయగడ, కొరాపుట్, దక్షిణ అంతర్గత ఒడిశాలోని కొన్ని ప్రదేశాల్లో మరియు రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో ఒకటి లేదా రెండు ప్రదేశాల్లో కూడా నిస్సారమైన పొగమంచు ఏర్పడవచ్చు. రాబోయే 24 గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా ఒకటి లేదా రెండు చోట్ల నిస్సారమైన పొగమంచు కొనసాగుతుందని వాతావరణ శాఖ సమాచారం.

ప్రభుత్వ మార్గదర్శకాలు

రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా దట్టమైన పొగమంచు కమ్ముకుంటూ ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసింది. రహదారిపై దృశ్యమానత తగ్గడం, ప్రమాదాల సంభావ్యత బలం పుంజుకోవడంతో వాహనదారులు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి రవాణా శాఖ గురువారం మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపింది. పొగమంచు వాతావరణంలో రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ఈ క్రింది భద్రతా చర్యలు తీసుకోవాలని విభాగం పేర్కొంది.

- వాహనాలను నెమ్మదిగా నడపాలి.
- సకాలంలో బ్రేకులు వేయడానికి వాహనాల మధ్య తగిన దూరం పాటించాలి.
- పొగమంచులో డ్రైవింగ్ చేస్తున్నప్పుడు ఎల్లవేళలా హెడ్ లైట్లను ఆన్ చేయాలి. పొగమంచు పరిస్థితులలో దృశ్యమానతను పెంచడానికి ఫాగ్ ల్యాంప్ ఉపయోగించండి.
- రహదారి గుర్తులను గమనిస్తూ మలుపులు, ఇతర రహదారి సంకేతాలను గుర్తుంచడం అనివార్యం.
- అత్యంత ఏకాగ్రతతో వాహనాలు నడపాలి. మొబైల్ ఫోన్లు, హెడ్ సెట్‌లు పెట్టుకోకూడదు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

ఆమదాలవలస: జగనన్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా.. వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో ఆమదాలవలస మున్సిపాలిటీ రావికంటిపేట గ్రామంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. రవికుమార్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులంతా ఈ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించామన్నారు. మొత్తం 16 జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు.

విజేతకు రూ.50వేలు, రెండో బహుమతి రూ.40వేలు, మూడో బహుమతి రూ.30వేలు, నాల్గో బహుమతి కింద రూ.20వేలు ప్రదానం చేస్తామన్నారు. పోటీలను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు సుందరరావు మాస్టారు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రెసిడెంట్ రమణ, రిఫరీ బోర్డు చైర్మన్ తిరుపతి రావు మాస్టారు, కబడ్డీ బోర్డు చైర్మన్ శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


క్రీడాకారులకు కిట్‌లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్

'కన్యాకుమారి' టీజర్ విడుదల

నరసన్నపేట: జిల్లాలో చిత్రీకరణ జరుపుకున్న 'కన్యాకుమారి' సినిమా టీజర్ విడుదల చేసినట్లు చిత్ర దర్శకుడు అట్టాడ సృజన్ కుమార్ తెలిపారు. ఈ టీజర్‌ను సినీ హీరో విజయ దేవర కొండ విడుదల చేశారని యూట్యూబ్‌లో వైరల్ అవుతోందని దర్శకుడు సృజన్ ఒక ప్రకటనలో తెలిపారు. రాడికల్ బ్యానర్‌పై ఈ చిత్రం నిర్మిస్తుండగా, 2022 నవంబర్‌లో శాలిహుండం కొండపై వేణుగోపాల స్వామి ఆలయం వద్ద షూటింగ్ ప్రారంభించామ ని, ఇందులో గీతా షైనీ, శ్రీ చరణ్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్నట్లు తెలిపారు. కాగా 120 రోజుల పాటు మూడు షెడ్యూల్స్‌లో శ్రీకాకుళం పట్టణంతో పాటు గార, నరసన్నపేట, పోలాకి, జలుమూరు మండలాల్లో పలు చోట్ల చిత్రీకరణ చేసినట్లు పేర్కొన్నారు.



కన్యాకుమారి టీజర్ పోస్టర్

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరొకరి తీవ్ర గాయాలు


మందస: మండలంలోని కిల్లోయి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సవర ఉమాపతి(28) అనే యువకుడు మృతి చెందాడు. ఆడుకునేందుకు వెళ్లిన కుమారుడు ఇలా శవమై తిరిగి రావడంతో తల్లిదండ్రులు సవర చంద్రయ్య, సీతమ్మలు కన్నీరుమున్నీరయ్యారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని గిరిజన పంచాయతీ బొగాబందలో సియాలుట్టి గ్రామానికి చెందిన సవర ఉమాపతి(28), కొంకడాపుట్టి గ్రామానికి చెందిన కొయ్యాపు ఢిల్లేశ్వరరావు అనే మరో యువకునితో వీరగున్నమ్మపురంలో జరుగుతున్న ఆటల పోటీలకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. మధ్యాహ్నం 12.30 గంటలకే పోటీలు ముగియగా.. తిరుగుముఖం పట్టారు. సాయంత్రం ఇంటికి చేరే సమయంలో కిల్లోయి శ్మశాన వాటిక వద్ద ఇదే మండలంలోని పాత్తంగికి చెందిన ఆటో.. ఉమాపతి ప్రయాణిస్తున్న బైక్ ఢీకొన్నాయి. ప్రమాదంలో ఉమాపతికి తీవ్ర గాయాలయ్యాయి. వెనుక ఉన్న ఢిల్లేశ్వరరావుకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. వీరిద్దరినీ పలాస సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈలోగా పరిస్థితి విషమించడంతో ఉమాపతి మరణించాడు.

ఢిల్లేశ్వరరావుకు చేయి విరిగిపోవడంతో హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మృతునికి సోదరుడు పూర్ణారావు ఉన్నాడు. సంఘటనా స్థలానికి సమీపంలోనే ఉమాపతి ఇల్లు ఉండడంతో తల్లిదండ్రులు, బంధువులు సంఘటన స్థలానికి చేరుకుని రోదించారు. ఉమాపతి మృతితో సియాలుట్టిలో విషాదచాయలు అలముకున్నాయి. మందస ఎస్ఐ బి.అనిల్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.


సవర ఉమాపతి (ఫైల్)


ప్రమాదానికి గురైన ద్విచక్రవాహనం, ఆటో


బలగ మేలుకొలుపు బృందం



మేలుకొలుపు విని..
మీకు శుభమని

- భజనలతో భక్తి నివేదన
- నెల రోజుల పాటు ధనుర్మాస సేవలు

శ్రీకాకుళం కల్చరల్:

ఒకరు మౌనంగా కొలుస్తారు. మరొకరు మంత్రాలు చదువుతారు. ఇంకొకరు భక్తితో గీతాలాపన చేస్తారు. భగవంతుని స్మరణకు మానవాళి ఎంచుకున్న మార్గాలెన్నో. వాటిలో ఒకటి మేలుకొలుపు. ముఖ్యంగా ధనుర్మాసంలో నెల రోజుల పాటు నిర్వహించే ఈ మేలుకొలుపులు వేకువనే భక్తిభావాన్ని మేల్కొలుపుతాయి. జిల్లా వ్యాప్తంగా అనేక భజన బృందాలు ఎన్నో ఏళ్లుగా ఈ సంప్రదాయాన్ని ఆచరిస్తున్నాయి. శ్రీకాకుళం పట్టణంలోనే దాదాపు 15 వరకు భజన బృందాలు ఉన్నాయి. తమ గురువులు రాసిన పాటలను పాడుతూ ఏకాదశి వంటి పుణ్యకాలాల్లో భజనలూ చేస్తు తమ భక్తిని ప్రదర్శిస్తున్నారు. ధనుర్మాసం సందర్భంగా నెలరోజుల పాటు వీధులలో, గ్రామాల్లో తెల్లవారుజామునే కీర్తనలు ఆలపిస్తారు. వీరిలో కొన్ని భజన బృందాలు బియ్యం, వస్తువులు, డబ్బులు కూడా సేకరిస్తారు. వాటిని ఒక రోజున ఉచితంగా అన్నప్రసాద వితరణ, మిగిలిన దానితో సంబంధిత ఆలయ అభివృద్ధికి ఖర్చు చేస్తారు.


చలిలో పాతశ్రీకాకుళం వెంకటేశ్వర భజన మండలి


కొన్నావీధి భజన బృందం

50 ఏళ్లుగా బలగలో..

గత 50 ఏళ్లుగా బలగ హరేరామ మందిరం భక్త బృందం ధనుర్మాస మేలుకొలుపులు నిర్వహిస్తున్నారు. 1970లో ఈ భక్త బృందం ఒక ఆధ్యాత్మిక కుటీరాన్ని నిర్మించింది. వీరు సేకరించిన వస్తువులతో ఏటా రథసప్తమి నాడు అన్నదానం చేస్తారు. మిగిలిన సొమ్మును మందిరం అభివృద్ధి కోసం ఖర్చు చేస్తారు.

25 ఏళ్లుగా భీమేశ్వర భజన మండలి

పట్టణంలోని కొన్నావీధిలోగల భీమేశ్వరాలయం వద్ద ఏర్పాటైన శ్రీభీమేశ్వర భజన మండలి పాతికేళ్లుగా మేలుకొలుపులు పాడుతోంది. ప్రతిరోజూ ఉదయం ఈ సభ్యులు కొన్నావీధి భీమేశ్వరాలయానికి ఉదయం 5 గంటలకు చేరుకుంటారు. ధనుర్మాస సమయంలో నెల రోజులపాటు వీధుల్లో భజనలు చేస్తూ తిరుగుతారు. సేకరించిన బియ్యం, సొమ్మును సంక్రాంతి రోజున ఆలయం వద్ద ఏకాహం రోజున ఖర్చు చేస్తారు. మేలుకొలుపు ద్వారా సేకరించిన సొమ్ముతో పేదలకు వస్త్రదానం చేస్తారు. అలాగే పాతశ్రీకాకుళంలోని కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయం కేంద్రంగా గత 12ఏళ్లుగా మేలు కొలుపు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. కొత్తూరు, మెళియాపుట్టి, పాతపట్నం వంటి చోట్ల కూడా మేలుకొలుపులు దశాబ్దాలుగా నిర్వహిస్తున్నారు.

దేవుని సేవతో మానవ సేవ

దేవుని సేవతోపాటుగా మానవ సేవ కూడా నిర్వహిస్తున్నాం. తెల్లవారు జామున పెద్దగా పాడుతూ తిరగడం వలన వ్యాయామం చేసినట్లే. 14 ఏళ్లుగా దీన్ని నిర్వహిస్తున్నాం. మాగురువు చవిటి పల్లి రాజారావు స్ఫూర్తితో ఈ భజన మండలి ఏర్పాటు చేశాం. 500 భజన పాటలు సినిమా సంగీత బాణీలో కూర్చి పాడుతుంటాం. ఎవరైనా చనిపోయినా కూడా భజన కోసం వెళుతుంటాం.

– బారికల రామారావు, అధ్యక్షులు, భజనమండలి

క్లుప్తంగా

పారదర్శకంగా కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ

● డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ పారదర్శకంగా జరుగుతుందని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యారోగ్యశాఖలో ఉన్న వివిధ కేటగిరీల్లో ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, హెల్త్ అసిస్టెంట్ మేల్, ఫిమేల్ కాంట్రాక్ట్ పద్ధతిలో 2014కు ముందునుంచి పనిచేస్తున్నారని, వారిని శాశ్వత ప్రాతిపదికన క్రమబద్ధీకరించే ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. దీనిపై ఎవరికీ డబ్బులు ఇవ్వవలసిన అవసరం లేదని, ఎవరైనా అడిగితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య



మృతుడు అప్పలనాయుడు (ఫైల్)

దత్తిరాజేరు: మండలంలోని గడసాం గ్రామానికి చెందిన మజ్జి అప్పలనాయుడు (47) పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి పెదమానాపురం ఎస్సై శిరీష గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 7వ తేదీన తన పొలంలో ఉన్న సోలార్ పలకలను మజ్జి వెంకటేష్ అనే వ్యక్తి విరగ్గొట్టడంతో ఆతనిపై చర్యలు తీసుకోవాలని పోలీసులు, గ్రామస్తులకు చెప్పినా, న్యాయం జరగలేదని మనస్తాపానికి గురైన అప్పలనాయుడు గురువారం పురుగుమందు తాగేసి అపస్మారక స్థితికి చేరుకున్నా డు. దీంతో కుటుంబసభ్యులు వెంటనే గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహన్ని పోస్ట్ మార్టం నిమిత్తం విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై చెప్పా రు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. భార్య నారాయణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వైభవంగా ముడుపుల సేవ



స్వామివారికి ముడుపులను సమర్పిస్తున్న భక్తులు

మెంటాడ: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామివారికి 1001 ముడుపులను భక్తులు సమర్పించారు. ముందుగా స్వామివారి పేరుతో ముడుపులను కట్టి, ప్రత్యేక పూజల అనంతరం ఆలయం చుట్టూ భక్తులు 11సార్లు ప్రదక్షిణ చేసి ముడుపులను సమర్పించారు.ఆలయ ప్రధాన అర్చకుడు పీసపాటి కృష్ణమాచార్యులు ముడుపుల సేవా కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ముప్పిడి నగేష్, కొల్లా భరత్, మాచర్ల అప్పారావు, పాండ్రంకి వెంకట వరహాలరావు, నంబూరి సతీష్‌కుమారులతో పాటు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

బెల్ట్ షాపుపై దాడి

● 50 మద్యం సీసాలు సీజ్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని జోగిరాజుపేటలో బెల్ట్‌షాపుపై పోలీసులు గురువారం దాడి చేశారు. ముందస్తు సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా.. నిందితుడి నుంచి 50 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నారాయణరావు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

భోగాపురం: మండలంలోని సవరవిల్లి గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గురువారం దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు. నిందితుల నుంచి 13,850 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

నగర అభివృద్ధే కోలగట్ల లక్ష్యం

● కార్పొరేషన్ మేయర్ విజయలక్ష్మి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న నగర మేయర్ విజయలక్ష్మి

విజయనగరం: జిల్లా కేంద్రాన్ని సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దడమే డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ధ్యేయమని నగర మేయర్ విజయలక్ష్మి అన్నారు. కోటీ 12 లక్షల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. 31, 32, 33, 42, 43 డివిజన్లలో వివిధ రకాల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నగర అభివృద్ధికి అహర్నిశలు ప్రణాళికలు రచించి అమలు చేయడమే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషి చేస్తున్నారన్నారు. కోటీ 12 లక్షల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందని చెప్పారు. నగరంలో ఇప్పటికే తాగునీటి సమస్య లేకుండా రోజు విడిచి రోజు నీటి పంపిణీ జరిగే విధంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, శాసనసభ్యుడిగా కోలగట్ల వీరభద్రస్వామిని గెలిపించాలని కోరారు.

రా..కదలిరా తుస్..!

● చంద్రబాబుకు దమ్ముంటే బొబ్బిలి టికెట్ బీసీలకు ఇవ్వాలి
● 2024 ఎన్నికల్లో మరోసారి జగన్ ప్రభంజనం ఖాయం
● జెడ్పీచైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం:

ప్రతిపక్ష టీడీపీ బొబ్బిలి నియోజకవర్గంలో నిర్వహించిన రా..కదలిరా కార్యక్రమం అట్టర్‌ప్లాప్ అయిందని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి ఆ సభకు లక్షలాది మంది వస్తారని భావించినప్పటికీ వారి అంచనాలు తరుమారయ్యాయన్నారు. ఇటీవల భోగాపురం వేదికగా నిర్వహించిన యువగళం ముగింపు సభ మాదిరిగానే బొబ్బిలి సభకు స్పందన కరువైందని, దీంతో రాష్ట్రంలో, జిల్లాలో టీడీపీ పరిస్థితి తేటతెల్లమవుతోందని ఎద్దేవా చేశారు. ఈ మేరకు గురువారం ఆయన జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రతిపక్ష నేత చంద్రబాబు మాయమాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని, ఆ రోజులు పోయాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ప్రస్తుతమున్న టీడీపీ నాయకత్వానికి, ఎన్టీఆర్ నాయకత్వంలోని టీడీపీకి తేడా ఉందన్నారు. ప్రస్తుతం డూప్లికేట్ టీడీపీకి ప్రజాదరణ లేకపోవడంతో ఎన్టీఆర్ భావజాలంతో రా..కదలి రా..అంటూ ఓటర్లను ఆకర్షించే పనిలో పడ్డారని ఎద్దేవా చేశారు.

రాజులకు మంత్రి పదవి ఘనత చంద్రబాబుదే

తమ హయాంలో బీసీలకు అగ్రపీఠం వేశామని, వారికి రాజ్యాధికారం కల్పించామని చంద్రబాబు చెప్పడం సిగ్గుచేటని మజ్జి శ్రీనివాసరావు మండిపడ్డారు. జిల్లా వ్యాప్తంగా 1000మంది ఓటర్లులేని సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు రాజులను పక్కన కూర్చుండబెట్టుకుని బీసీల కోసం చంద్రబాబు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. తన హయాంలో విజయనగరం జిల్లాలో బీసీలకు కేటాయించిన మంత్రి పదవిని వైఎస్సార్‌సీపీ గుర్తుపై గెలిచి టీడీపీలో చేరిన రాజులకు మార్పు చేయడాన్ని జిల్లా ప్రజలు మర్చిపోలేదన్నారు. వెనుకబడిన విజయనగరంలో ఎంతో మంది బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకులున్నా అధికారంలోకి వచ్చిన తరువాత వారికి తగిన సముచిత స్థానం కల్పించలేదన్నారు. చంద్రబాబుకు దమ్ముంటే బొబ్బిలి శాసనసభా నియోజకవర్గ టిక్కెట్ బీసీలకు ఇవ్వాలని సవాల్ విసిరారు.

రాజులు బొబ్బిలికి ఏం చేశారు..?

బొబ్బిలి నియజకవర్గంలో స్థానిక ప్రజల ఓట్లతో 3 సార్లు ఎమ్మెల్యేగా నిలిచిన రాజులు స్థానిక ప్రజలకు..నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేశారో చెప్పగలరా..? అంటూ మజ్జి శ్రీనివాసరావు సవాల్ చేశారు. వెనుకబడిన విజయనగరం జిల్లాకు సాగు, తాగునీటి ప్రాజెక్టులు తీసుకువచ్చి అమలు చేసిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిదేనని, అనంతరం అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి వాటిని శతశాతం పూర్తి చేస్తున్నారన్నారు. బొబ్బిలి రాజుల హయాంలో చెప్పుకునేందుకు ఒక్క అభివృద్ధికార్యక్రమం చేపట్టలేదన్న విషయం నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసన్నారు.

మరోమారు జగన్ ప్రభంజనం

ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు ఎన్ని కుటిల రాజకీయాలు చేసినా 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోమారు జగన్‌మోహన్ రెడ్డి ప్రభంజనాన్ని ఎవ్వరూ ఆపలేరని మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజల జీవన ప్రమాణాలు పెంచడంలో భాగంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని, ప్రజలు సైతం సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఉమ్మడి విజయనగరం జిల్లాలో అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలుపొంది మళ్లీ ప్రభుత్వాన్ని కొనసాగిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

సామాజిక న్యాయానికి ప్రతీక అంబేడ్కర్ స్మృతివనం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే అలజంగి జోగారావు తదితరులు

విజయనగరం రూరల్: సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలిచేలా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం ఈ నెల 19న విజయవాడలో ప్రారంభించనున్నారని జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో చారిత్రాత్మక నిర్ణయానికి శ్రీకారం చుట్టారన్నారు. గత పాలకులు సామాజిక న్యాయం కోసమని ప్రస్తావించినప్పటికీ దాన్ని క్షేత్ర స్థాయి వరకు తీసుకువెళ్లి అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. దేశంలోనే అతిపెద్దదైన 125అడుగుల ఎత్తు ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని రూ.404 కోట్ల ఖర్చుతో తీర్చిదిద్ది ఈ నెల 19న విజయవాడ నడిబొడ్డున ఆవిష్కరించనున్నారని తెలిపారు. సామాజిక న్యాయం తీసుకురావాలనే అంబేడ్కర్ స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతి సచివాలయం నుంచి 6 నుంచి 7 మంది వరకు ఈ కార్యక్రమానికి తరలివెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావులు సామాజిక న్యాయ మహాశిల్పం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జోనల్ ఎస్సీ సెల్ ఇన్‌చార్జ్ కంబాల సందీప్, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు పి.జైహింద్‌కుమార్, పలువులు జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

లాభాల బాటలో డీసీఎంఎస్

● చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన



మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన

విజయనగరం ఫోర్ట్: డీసీఎంఎస్ (జిల్లా సహకార మార్కెట్ కమిటీ)ను లాభాల బాటలో నడిపిస్తున్నామని చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన పేర్కొన్నారు. ఈ మేరకు డీసీఎంఎస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కరోనా వంటి కష్టకాలంలో కూడా రైతులకు అండగా ఉన్నామని చెప్పారు. విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటు ధరలో ఉంచామని తెలిపారు. సేంద్రియ ఉత్పత్తులను ప్రోత్సహిస్తున్నామన్నారు. లేపాక్షి పుస్తకాలు డీసీఎంఎస్ అందుబాటులో ఉన్నాయని, జనరిక్ మందుల దుకాణం కూడా డీసీఎంఎస్ ద్వారా త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. విజయనగరం డీసీఎంఎస్ రాష్ట్రంలో 5వ స్థానంలో ఉందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి తమ కృషి చేస్తామని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి అవనాపు విక్రమ్ మాట్లాడుతూ సీఎంజగన్‌మోహన్ రెడ్డి వివక్ష లేని పాలన అందిస్తున్నారని, 13 జిల్లాలను 26 జిల్లాలుగా చేసి పరిపాలన సులభతరం చేశారని చెప్పారు. విద్య, వైద్య రంగంలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి విప్లవాత్మక మార్పులు చేపట్టారని, అలాగే బీసీలకు పెద్దపీట వేశారన్నారు.

సంక్రాంతి సంబరాలకు సంప్రదాయ సామగ్రి కిట్లు

● ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
● కలెక్టర్ నాగలక్ష్మి



సంక్రాంతి సంబరాలకు అవసరమైన సామగ్రి కిట్ల తయారీ

విజయనగరం అర్బన్: జిల్లావ్యాప్తంగా ప్రజలు సంక్రాంతి సంబరాలను సంప్రదాయబద్ధంగా చేయడానికి అవసరమైన ప్రోత్సాహకాన్ని జిల్లా యంత్రాంగం చేపడుతోంది. అందుకు అవసరమైన సామగ్రిని మహిళా పొదుపు సంఘాల రైతులతో చేయించి వాటిని కిట్లుగా తక్కువ ధరలకు విక్రయించే విధానానికి కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సన్నాహాలు చేపట్టారు. అందులో భాగంగా రైతు ఉత్పత్తి మహిళా సంఘాల సభ్యుల ద్వారా భోగి, సంక్రాంతి కిట్లను డీఆర్‌డీఏ శాఖ తయారు చేయిస్తోంది. మహిళా రైతులు తయారు చేసిన ఆవుపేడ పిడకలు, పసుపు, కుంకుమ, వేపపుల్లలు, నలుగు పిండి, నువ్వుల నూనె, రేగుపళ్లు, చెరుకుముక్కలు, కొత్త బియ్యం, కొత్త బెల్లం, అగరబత్తీలు, హారతిసెట్ తదితర సామగ్రిని ఒక కిట్‌గా తయారు చేసి విక్రయిస్తారు. అదేవిధంగా కలగాయ కూరకు అవసరమైన కూరగాయల కిట్లు కూడా విక్రయిస్తారు. ఈ కిట్టులో వంకాయలు, బీరకాయలు, బెండకాయలు, గోరుచిక్కుడు కాయలు, కంద, చేమ, ఎర్రదుంప, అనాసకాయలు, గుమ్మడికాయలు తదితర అవసరమైన మేరకు కూరగాయలతో కలిపి కిట్టుగా తయారు చేసి, ఈ రెండురకాల కిట్లను సరసమైన ధరలకు జిల్లా కేంద్రం, అన్ని మండల కేంద్రాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా విక్రయిస్తారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి గురువారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

'రోసిస్ వర్చువల్ సొల్యూషన్స్'తో సీతం అవగాహన

విజయనగరం అర్బన్:



ఎంఓయూ చేసుకున్న సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు

విద్యార్థులు, అధ్యాపకులకు డ్రోన్ సాంకేతిక నైపుణ్యాభివృద్ధి కోసం రోసిస్ వర్చువల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో అవగాహన ఒప్పందం కుదిరిందని సత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (సీతం) డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక కళాశాల ప్రాంగణంలో గురువారం ఆ సంస్థ ప్రతినిధులతో ఎంఓయూ జరిగిందన్నారు. డ్రోన్‌కు సంబంధించిన ఆచరణాత్మక శిక్షణ ఇవ్వడం కోసం కళాశాలలో ఏర్పాటు చేసిన ఐసీడీటీ (ఇన్నోవేషన్ సెంటర్ ఫర్ డ్రోన్ టెక్నాలజీస్) నిర్వహణకు దోహదం పడుతుందన్నారు. ఈ ఎంఓయూ ద్వారా 1,500 మంది విద్యార్థులు, అధ్యాపకులకు డ్రోన్‌కు సంబంధించిన సాంకేతిక నైపుణ్యం మెరుగుపరచగలుగుతామన్నారు. సమావేశంలో రోసిస్ వర్చువల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ ఎస్‌కే వెంకట సతీష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ (అడ్మినిస్ట్రేషన్) డాక్టర్ డీవీపీఏ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ స్కూల్స్ నిబంధనల ప్రకారం నడపాలి



ట్రాన్స్‌పోర్ట్ ఉపకమిషనర్ జి.ఆర్.రవీంద్రనాథ్

విజయనగరం గంటస్తంభం: జిల్లాలో డ్రైవింగ్ స్కూల్స్ నిబంధనల ప్రకారం నడపాలని జిల్లా రవాణా శాఖ ఉప కమిషనర్ జి.ఆర్.రవీంద్రనాథ్ తెలిపారు. ఎస్.కోటలో నిబంధనలకు విరుద్ధంగా అనుమతి పత్రాలు లేకుండా నడుపుతున్న బాలాజీ డ్రైవింగ్ స్కూల్‌కు సంబంధించిన రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని విజయనగరం ఆర్టీసీ డిపోకు తరలించినట్లు చెప్పారు. ఇలా అనుమతులు లేకుండా ఏ స్కూల్ వాహనాల్లో తిరిగినా చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డ్రైవింగ్‌స్కూల్ వాహనాలన్నీ స్కూల్ పేరుమీద రిజిస్ట్రేషన్ అయి, ట్రాన్స్‌పోర్ట్ రిజిస్ట్రేషన్ నంబర్‌తో ఉండాలని స్పష్టం చేశారు. వాహనాలను తనిఖీ చేస్తామని, నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవన్నారు. ఈ వాహనాల కాలుష్య నివారణపై త్వరలోనే విస్తృతంగా తనిఖీలు చేస్తామని, వాహనదారులు కాలుష్య నియంత్రణ సర్టిఫికెట్లు తప్పనిసరిగా చేయించుకోవాలని కోరారు.

వాజీ రంగోలీ పోటీలకు టీవీ ఆర్టిస్ట్ పూజ



టీవీఆర్టిస్ట్ పూజ

విజయనగరం టౌన్: సనాతన సంప్రదాయాలను భావితరాలకు అందజేయాలనే ఉద్దేశంతో వాజీ చానల్ నిర్వహిస్తున్న రంగోలీ పోటీలకు ప్రముఖ టీవీ ఆర్టిస్ట్, గుండమ్మ కథ సీరియల్ ఫేమ్ పూజ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని వాజీ చానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ఆనందగజపతి ఆడిటోరియంలో ఈనెల 13న రంగోలీ పోటీలను నిర్వహిస్తున్నామని, పోటీల్లో రూ.4 లక్షల 50 వేల విలువైన బహుమతులు విజేతలకు అందజేస్తామని తెలిపారు. పోటీల్లో ముగ్గులు వేసే ప్రతి ఒక్కరికీ బహుమతులు ఉంటాయన్నారు. 13న మధ్యాహ్నం 3 గంటలకు రంగోలీ, హౌసీ విజేతలకు బహుమతి ప్రదానోత్సవం ఉంటుందన్నారు. డిసెంబర్ 31న వాజీ మెగా హౌసీలో ఫుల్‌హౌసీ అయి, పేర్లు నమోదుచేసుకున్న అభ్యర్థులు నేరుగా ఆనందగజపతి ఆడిటోరియంలో జరిగే బహుమతి ప్రదానోత్సవానికి హాజరుకావాలని సూచించారు కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన రద్దు

విజయనగరం క్రైమ్: సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఈ నెల 15న సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని రద్దుచేస్తున్నట్లు ఎస్పీ ఎం.దీపిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పందనకు వచ్చే ఫిర్యాదుదారులు విషయాన్ని గ్రహించాలని కోరారు.

అప్పుకాదు..ఆత్మ గౌరవం

● కలెక్టర్ నాగలక్ష్మి
● 14,857 మందికి జగన్న తోడు విడుదల



మెగా చెక్కును విడుదల చేసిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జగనన్న తోడు పథకం ద్వారా ఇస్తున్న రూ.10వేల రుణం ద్వారా చిరువ్యాపారుల్లో ప్రభుత్వం ఆత్మగౌరవాన్ని పెంచుతోందని కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారిని ఈ పథకం ఎంతగానో ఆదుకుంటోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆమె వివరించారు. జగనన్న తోడు పథకం కింద 8వ విడతగా జిల్లాలోని సుమారు 14,857 మంది లబ్ధిదారులకు రూ.15.71 కోట్ల వడ్డీ లేని రుణాన్ని ముఖ్యమంత్రి గురువారం విడుదల చేశారు. అలాగే జగనన్న తోడు పథకం కింద 6వ విడతలో రుణం తీసుకున్న 26,320 మంది లబ్ధిదారులకు రూ.54.94 లక్షలను వడ్డీ కింద విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసారంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డితో మాట్లాడుతూ జిల్లాలో ఈ పథకం కింద లబ్ధిదారులకు జరిగిన మేలును వివరించారు. ఇప్పటివరకు జిల్లాలో ఏడు విడతల్లో సుమారు 1,06,696 మంది చిరువ్యాపారులు, సంప్రదాయ వృత్తిదారులకు రూ.10వేల నుంచి రూ.13 వేల మధ్య దాదాపు రూ.101.12 కోట్లు వరకు వడ్డీలేని రుణాలను మంజూరుచేశామని తెలిపారు. అలాగే రుణాలు పొందిన 1,34,867 మంది చిరు వ్యాపారులకు వారి బ్యాంకు ఖాతాల్లో రూ.3.08 కోట్లను వడ్డీ కింద ఐదు విడతల్లో జమ చేశామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం నియోజకవర్గం వైఎస్ఆర్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి, మెప్మా పీడీ సుధాకరరావు, సచివాలయాల నోడల్ ఆఫీసర్ నిర్మలాదేవి, డీఆర్‌డీఏ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ముద్దాయికి 21 ఏళ్ల జైలుశిక్ష

విజయనగరం క్రైమ్: జిల్లాలోని ఎల్.కోట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో ముద్దాయికి 21 ఏళ్ల కఠినకారాగార శిక్ష, రూ.3వేలు జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి తీర్పు వెల్లడించారు. ఈ మేరకు ఎస్పీ ఎం.దీపిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. వేపాడ మండలంలోని రామస్వామిపేట గ్రామానికి చెందిన గుడే కోటేశ్వరరావు ఒక బాలికపై లైంగికదాడికి పాల్పడినట్లు బాలిక తండ్రి చేసిన ఫిర్యాదుతో ఎల్.కోట పోలీస్ స్టేషన్‌లో 2019 ఫిబ్రవరిలో పోక్సో చట్టం ప్రకారం అప్పటి ఎస్సై ప్రయోగమూర్తి కేసు నమోదుచేశారు. అప్పటి విజయనగరం డీఎస్పీ డి.సూర్య శ్రావణ్‌కుమార్ కేసు దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. అనంతరం విజయనగరం డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన పి.వీరాంజనేయరెడ్డి నిందితుడిపై న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. ఈ కేసులో నిందితుడు కోటేశ్వరరావు బాలికపై లైంగికదాడికి పాల్పడినట్లు రుజువు కావడంతో పోక్సో కోర్టు ఫర్ స్పెషల్ జడ్జి కె.నాగమణి పైవిధంగా తీర్పు వెల్లడించారు. పోక్సో కేసులో త్వరితగతిన శిక్షపడేలా వ్యవహరించిన దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూషన్ అధికారులను ఎస్పీ అభినందించారు.

రైస్ మిల్లులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

● విచారణ చేపట్టిన కేఆర్‌సీ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సుమబాల



కనకదుర్గ రైస్ మిల్లులో విచారణ చేపడుతున్న కేఆర్‌సీ ఎస్‌డీసీ సుమబాల

గంట్యాడ: మండలంలో ఉన్న రైస్ మిల్లులపై కలెక్టర్‌కు రైతులు ఫిర్యాదు చేయగా కోనేరు రంగారావు సిఫార్సుల కమిటీ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సుమబాల గురువారం మిల్లులపై విచారణ చేపట్టారు. మండలంలోని వసాది గ్రామానికి చెందిన భూమిరెడ్డి అప్పారావు, జామి మండలం తానవరం గ్రామానికి ఒక రైతు మురపాక సమీపంలో ఉన్న సూర్యరాజ్ మిల్లు వారు బస్తాకు 5 కిలోలు ఎక్కువగా ధాన్యం తీసుకుంటున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అదే విధంగా రావివలస వద్ద ఉన్న కనకదుర్గ రైస్‌మిల్లుపై కూడా కొంతమంది రైతులు ఫిర్యాదు చేయగా వసాది రైతు భరోసా కేంద్రంలో ముందుగా విచారణ చేపట్టారు. సూర్యరాజ్ మిల్లుపై ఫిర్యాదు చేసిన రైతు అప్పారావును విచారణ చేసి తనిఖీ చేశారు. రైతుల నుంచి ప్రభుత్వ నిబంధనల మేరకు మాత్రమే ధాన్యం తీసుకోవాలని సూచించారు. రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆమె వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద

● చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర



చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు మజ్జి సిరి సహస్రను సత్కరిస్తున్న దృశ్యం

విజయనగరం రూరల్:

యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద అని, యువతే దేశానికి వెన్నెముక అని జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుమార్తె, చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిరిసహస్ర ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత అన్ని రంగాల్లో రాణించి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు అందిస్తున్న ప్రోత్సాహం, సహాయంతో ఇతరులకు సహాయపడే గుణాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. నా తండ్రి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అందిస్తున్న ప్రోత్సాహంతో చిన్నశ్రీను సోల్జర్స్ సంస్థను ఏర్పాటుచేసి సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సిరి సహస్రను స్వచ్ఛంద సంస్థల సభ్యులు ఘనంగా సత్కరించారు. మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వారు ఆమెను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టిన పలువురిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కె.రాజ్‌కుమార్, చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షుడు తోట వాసు, కార్యదర్శి జాకీర్ హుస్సేన్, శ్రీనివాస్, రామకృష్ణ, శివ, జగదీష్, సాయి, నవీన్, చేయూత ఫౌండేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో ఎమర్జెన్సీ కార్డియాక్ కేర్ ప్రోగ్రాం

సీతంపేట: సైలెంట్ కిల్లర్ అయిన గుండెపోటు వచ్చేవారికి ప్రాథమిక చికిత్స అందజేసేందుకు వీలుగా ఐసీఎంఆర్ ఆధ్వర్యంలో సీతంపేట ఏరియా ఆస్పత్రిలో ఎమర్జెన్సీ కార్డియాక్ కేర్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. దీనికోసం ప్రత్యేకంగా ఒక గదిని కేటాయించారు. చికిత్సకు అవసరమైన బెడ్, ఆక్సిజన్ సిలెండర్ సదుపాయం కల్పించారు. రోగికి ఎటువంటి ప్రాణాపాయం కలగకుండా టెన్కాట్‌ప్లస్ అనే రూ.65 వేలు విలువైన ఇంజక్షన్‌ను కూడా అందుబాటులో ఉంచినట్టు ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. రోగి వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత ప్రత్యేక వైద్య నిపుణుల సూచన మేరకు ఇక్కడ ప్రాథమిక అత్యవసర వైద్యం అందిస్తామన్నారు.

108లో సుఖ ప్రసవం



అంబులెన్స్‌లో ప్రసవించిన గర్భిణి

సీతంపేట: మండలంలోని గిరిశిఖరాన ఉన్న సరిహద్దు గూడ గ్రామానికి చెందిన సవర ధమయంతి అనే గర్భిణికి 108 అంబులెన్స్ సిబ్బంది సుఖప్రసవం చేశారు. ధమయంతికి పురిటినొప్పులు రావడంతో ఆశ కార్యకర్త 108కు ఫోన్ చేశారు. ఈఎంటీ రాములు, పైలెట్ శంకరరావు గ్రామానికి చేరుకున్నారు. గర్భిణికి సపర్యలు చేశారు. ఆస్పత్రికి తీసుకువస్తుండగా నొప్పులు ఎక్కువకావడంతో మార్గంమధ్యలో అంబులెన్స్‌ను నిలిపివేసి వైద్యుల సూచన మేరకు ప్రసవం జరిపారు. గర్భిణి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డను సీతంపేట ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. 108 సిబ్బందికి గ్రామస్తులతో పాటు గర్భిణి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇజ్రాయిల్ దేశంలో కన్‌స్ట్రక్షన్ ఉద్యోగావకాశాలు

పార్వతీపురంటౌన్: ఇజ్రాయిల్ దేశంలో కన్‌స్ట్రక్షన్ సెక్టార్లో ప్లాస్టరింగ్, సిరామిక్, బిల్డింగ్ ఫ్రేంవర్క్స్, ఐరన్ బెండింగ్‌లో ఉద్యోగాలు పొందేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అవకాశం కల్పిస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 8వ తరగతి ఆపైన చదివి నైపుణ్యం కలిగి, 21 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల వయస్సు, కనీసం 3సంవత్సరాలు అనుభవం కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. హెచ్‌టీటీపీఎస్://డబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్/హోమ్/ఆన్‌లైన్‌ప్రోగ్రా రిజి స్ట్రేషన్ వెబ్‌సైట్‌లో ఆసక్తి కలిగిన వారు వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు సెల్‌నంబర్ 7997299739ను సంప్రదించాలని తెలిపారు.